ఆర్థిక సాయం అందజేత

వట్టినాగులపల్లి గ్రామానికి చెందిన అల్లం మల్లేశం కుమార్తె వివాహానికి రూ.71వేల నగదును అందజేస్తున్న మాజీ సర్పంచ్ స్వరూప, మాజీ ఎంపీటీసీ నాగేష్

మణికొండ,నవంబర్ 17 : పేద కుటుంబాలకు చెందిన ఆడపడుచులకు అండగా ఉంటూ తమ వంతు సహకారం అందించడంతో ఉన్న సంతృప్తి మరొకటి లేదని వట్టినాగులపల్లి గ్రామ మాజీ సర్పంచ్ స్వరూప,మాజీ ఎంపీటీసీ సభ్యుడు నాగేష్‌యాదవ్ దంపతులు అన్నారు. తమ గ్రామానికి చెందిన అల్లం మల్లేశం కుమార్తె వివాహానికి ఆర్థిక సహాయంలో రూ.71వేల నగదును అందజేసి తమ సేవాగుణాన్ని చాటుకున్నారు. పేదింట పెళ్లిలో తమ వంతు సహకారం జీవితాంతం చేస్తామని వారు వెల్లడించారు.

30న జరిగే రాష్ట్ర స్థాయి సదస్సును

విజయవంతం చేయాలి

హిమాయత్‌నగర్,నవంబర్17: ఎస్సీ వర్గీకరణ, క్రీమిలేయర్‌ను వ్యతిరేకిస్తూ ఈనెల 30న బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో జరిగే రాష్ట్ర స్థాయి సదస్సుకు మాలలు అధిక సంఖ్యల్లో తరలివచ్చి విజయవంతం చేయాలని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు వి.ఎల్.రాజు పిలుపునిచ్చారు. ఆదివారం హిమాయత్‌నగర్‌లో జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఎస్సీ వర్గీకరణ, క్రీమిలేయర్‌ను అమలు చేయడం వల్ల దళితులకు తీరని అన్యాయం జరగడంతో పాటు విద్య,ఉద్యోగ అవకాశాలను కోల్పోయే అవకాశం ఉందన్నారు.ఇప్పటికే రిటైర్డ్ జడ్జి షమీర్ అక్తర్ ఏక సభ్య కమిషన్‌ను నియమించి ఎస్సీ వర్గీకరణను అమలు చేసేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోందన్నారు.ప్రజల సమస్యలను పట్టించుకోకుండా రాజకీయ డ్రామాలను కాంగ్రెస్ ప్రభుత్వం ఆడుతుందని విమర్శించారు.
ఈ సమావేశంలో మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు జె.ఎన్.రావు,జాతీయ ఉపాధ్యక్షుడు భాస్కర్‌రావు,సుప్రీంకోర్టు న్యాయవాది వడ్లమూరి కృష్ణ స్వరూప్,ఆర్‌పీఐ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.అశోక్ తదితరులు పాల్గొన్నారు.

సత్యం శివం సుందరం గోశాలలో.. అన్నకూట్ మహోత్సవాలు

దక్షిణ భారతదేశంలోనే గగన్‌పహాడ్‌లో నిర్వహించబడుతున్న అతి పెద్ద సత్యం శివం సుందరం గోశాలలో ఆదివారం మహా అన్నకూట్ మహోత్సవాలు ఘనంగా జరిగాయి. వేలాది మంది జంతు ప్రేమికులు, భక్తులు రోజంతా ఈ వేడుకల్లో పాల్గొన్నారు. అన్నకూట్ సాహిత్యపరమైన అర్థం ఆహార పర్వతం ఇది దేవుడికి ఆహార నైవేద్యాన్ని, దానిని తయారు చేయడంలో ఉన్న ప్రేమ, భక్తిని సూచిస్తుంది. పండిత్ హరిశ్చంద్రజీ కులకర్ణి మహాలక్ష్మి పంచకుండియ మహాయజ్ఞం నిర్వహించారు. అనిరుద్ధీ మధురమైన భజనలు ఆలపించారు. – మైలార్‌దేవ్‌పల్లి, నవంబర్ 17

చదువుతో పాటు..

ఆధ్యాత్మిక చింతన ఉండాలి

జీఎంఆర్ చిన్మయ విద్యాలయ ఆచార్యులు బ్రహ్మచారి విముక్త చైతన్య

సిటీబ్యూరో, నవంబర్ 17 (నమస్తే తెలంగాణ): విద్యార్థులకు చదువుతో పాటు ఆధ్యాత్మిక చింతన కూడా ఎంతో అవసరమని జీఎంఆర్ చిన్మయ విద్యాలయ ఆచార్యులు బ్రహ్మచారి విముక్త చైతన్య అన్నారు. చిన్మయ మిషన్ మార్గదర్శకాలతో శంషాబాద్ ఎయిర్‌పోర్ట్‌లోని జీఎంఆర్ చిన్మయ విద్యాలయ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి భగవద్గీత పారాయణ పోటీలను ఆదివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆచార్య బ్రహ్మచారి విముక్త చైతన్య మాట్లాడుతూ.. ప్రస్తుతం సమాజంలో నేరాలు, ఘోరాలు, పాశ్చాత్య విష సంస్కృతి పెరిగిపోతున్నాయని, వీటి ప్రభావం భావితరాలపై పడకుండా ఉండాలంటే విద్యార్థులకు చిన్ననాటి నుంచే ఆధ్యాత్మిక చింతన అలవాటు చేయాలన్నారు. విద్యాలయ ప్రిన్సిపాల్ ఆర్.సుమతి మాట్లాడుతూ చిన్మయ మిషన్ మార్గదర్శకాల మేరకు నిర్వహించిన భగవద్గీత పారాయణ పోటీలలో రంగారెడ్డి జిల్లా వ్యాప్తంగా మొత్తం 140మంది విద్యార్థులు పాల్గొన్నట్లు తెలిపారు. ఈ పోటీల్లో మొదటి స్థానం సాధించిన విద్యార్థులు రాష్ట్ర స్థాయి పోటీలకు అర్హులని, జీఎంఆర్ చిన్మయ విద్యాలయ నుంచి 5వ తరగతి విద్యార్థి శ్రవంత్ రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు వెల్లడించారు.

జీఎంఆర్ చిన్మయ విద్యాలయ ఆధ్వర్యంలో జరిగిన జిల్లాస్థాయి భగవద్గీత పారాయణ పోటీల్లో పాల్గొని విజయం సాధించిన విద్యార్థులు. చిత్రంలో విద్యాలయ ఆచార్యులు బ్రహ్మచారి విముక్త చైతన్య, విద్యాలయ ప్రిన్సిపాల్ ఆర్.సుమతి

ఉచిత వైద్య శిబిరాలను

సద్వినియోగం చేసుకోవాలి

సర్దార్ పటేల్ పార్కులో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న మణికొండ మున్సిపాలిటీ వైస్ చైర్మన్ కె.నరేందర్‌రెడ్డి

మణికొండ, నవంబర్ 17: ఉచిత వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మణికొండ మున్సిపాలిటీ వైస్ చైర్మన్ కె.నరేందర్‌రెడ్డి అన్నారు. మణికొండ సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సర్దార్ పటేల్ పార్క్ వాక్‌మెట్స్ సహకారంతో డాక్టర్ ఆర్.కే.క్లీనిక్స్ సహకారంతో ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఉదయం 7: 30 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు ఈ శిబిరాన్ని నిర్వహించారు. రక్త పరీక్షలు, ఈసీజీ, బోన్ డెన్సిటీ టెస్ట్, దంత , ఆర్థోపెడిక్ , గుండె పరీక్షలు చేశారు. అవసరం ఉన్న వారికి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వైస్ చైర్మన్ కె.నరేందర్‌రెడ్డి పాల్గొని కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ..ప్రజలు తమ ఆరోగ్యాలపై శ్రద్ధ వహించాలన్నారు. ప్రతి రోజూ వాకింగ్, జాకింగ్, వ్యాయామం, యోగా చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో 4వ వార్డు కౌన్సిలర్ వందనా నాగేష్, సర్దార్ పటేల్ పార్క్ వాక్‌మెట్స్ ప్రధాన కార్యదర్శి తిప్పరాజు రమేష్‌రాజు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

పెండింగ్ నీటి బిల్లుల బకాయిలపై అధికారుల దృష్టి

వన్ టైమ్ సెటిల్‌మెంట్‌ను సద్వినియోగం చేసుకోవాలి

ఈ నెల 30 వరకు అవకాశం..బకాయిదారులకు డిమాండ్ నోటీసులు

జూబ్లీహిల్స్, నవంబర్ 17 : ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాల్లో పేరుకుపోయిన జల మండలి నీటి బిల్లుల బకాయిలపై అధికారులు దృష్టి సారించారు. బకాయిల చెల్లింపులను సులభతరం చేసేందుకు నిబంధనలను సడలించి అఫిడవిట్‌కు బదులుగా సెల్ఫ్ డిక్లరేషన్ స్వీకరిస్తున్న విషయం తెలిసిందే. బీపీఎల్ వినియోగదారులు మినహాయించి ఓటీఎస్ పథకానికి అర్హులైన వినియోగదారులకు పెండింగ్ బకాయిలలో వడ్డీతో పాటు లాస్ట్ పేమెంట్ జరిమానాలు, మీటర్ జరిమానాలు పూర్తిగా మాఫీ చేసి ఈ పథకాన్ని అమలుచేస్తున్నారు. వన్ టైమ్ సెటిల్‌మెంట్ పథకాన్ని నవంబర్ 30 వరకు గడువు పొడిగించిన అధికారులు ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాల చిట్టా వెలికితీస్తున్నారు. ఇందులో భాగంగా భారీగా బకాయిలున్న ఆయా కార్యాలయాలకు డిమాండ్ నోటీసులు జారీ చేస్తున్నట్లు జలమండలి డివిజన్-6 జీఎంఎస్.హరిశంకర్ తెలిపారు. జలమండలి వినియోగదారులు ఓటీఎస్ పథకాన్ని సద్వినియోగం చేసుకుని పెండింగ్ బకాయిలు చెల్లించాలని ఓ ప్రకటనలో కోరారు. పెండింగ్‌లో ఉన్న నీటి బిల్లులు చెల్లించేందుకు 100 శాతం వడ్డీ మాఫీ చేస్తున్నట్లు తెలిపారు. మరిన్ని వివరాలకు స్థానిక జలమండలి కార్యాలయాలతో పాటు 155313 టోల్ ఫ్రీ నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

రవాణ శాఖ మంత్రిది అవగాహన రాహిత్యం

మారేడ్‌పల్లి, నవంబర్ 17: రాష్ట్ర రవాణాశాఖ మంత్రి అవగాహన రాహిత్యంతో మాట్లాడుతున్నారని, కంటోన్మెంట్‌కు రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఎలాంటి నిధులు విడుదల కాలేదని కంటోన్మెంట్ బోర్డు నామినేటెడ్ సభ్యుడు జె.రామకృష్ణ అన్నారు. ఆదివారం మహీంద్రాహిల్స్‌లోని తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎలివేటెడ్ కారిడార్ల కోసం అప్పగించిన కంటోన్మెంట్ భూముల పరిహారం విషయంలో ప్రజలను మంత్రి తప్పు దోవ పట్టిస్తున్నారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం రూ.3.23 కోట్ల నిధులను కేంద్ర ప్రభుత్వ కన్సాలిడేటెడ్ ఫండ్‌లో జమ చేయలేదని విమర్శించారు.

హైదర్‌గూడ పోచమ్మ దేవాలయంలో శంకు పూజలు

మైలార్‌దేవ్‌పల్లి, నవంబర్ 17: రాజేంద్రనగర్ సర్కిల్ అత్తాపూర్ డివిజన్ హైదర్‌గూడ పోచమ్మ దేవాలయంలో ఆదివారం శంకు పూజలు ఘనంగా నిర్వహించారు. వేద పండితుల మంత్రోచ్చరణల మధ్య దేవాలయ పుననిర్మాణ పూజలను వైభవంగా చేపట్టారు. నేటి నుంచి దేవాలయ నిర్మాణ పూజలు వేగవంతంగా ప్రారంభిస్తున్నట్లు దేవాలయ కమిటీ అధ్యక్షుడు సోమారం రాజ్‌కుమార్ తెలిపారు. ఈ పూజల్లో గోదల భాస్కర్, సోమారం రవీందర్, గోదల చంద్రయ్య, మద్దూరి శివశంకర్, కొత్తూరు మల్లేష్, మద్దూరి బాలసుబ్రహ్మణ్యం, మద్దూరి బాలమురళీకృష్ణ, శ్రీకాంత్, చిత్తారి, శ్రీను, గోపాల్, మహేందర్, బస్తీ వాసులు పాల్గొన్నారు.

ట్రంకు పెట్టెలు సిద్ధం

జూబ్లీహిల్స్,నవంబర్17: సమగ్ర కుటంబ సర్వే దరఖాస్తులను భద్రపరిచేందుకు ట్రంకు పెట్టెలు సిద్ధమయ్యాయి. గతంలో ప్రజా పాలన దరఖాస్తులను కూడా ట్రంకు పెట్టెల్లో తరలించి 6 గ్యారెంటీలను అటకెక్కించిన విషయం తెలిసిందే. అసలు సర్వే ఎందుకు చేస్తున్నారో తెలియడంలేదన్న అయోమయంలో ప్రజలుండగా మళ్లీ ప్రజల భవిష్యత్‌ను ట్రంకు పెట్టెల్లో పెట్టి తాళం వేసేందుకు అధికారులు సిద్ధమవుతున్నారు. ప్రజా పాలనలో తీసుకున్న దరఖాస్తులు ఏమయ్యాయని ప్రజలు ప్రశ్నిస్తున్న నేపథ్యంలో దరఖాస్తులను తరలించేందుకు కొత్త సీసాలో పాత సారా చందంగా కొత్త ట్రంకు పెట్టెలను సిద్ధం చేస్తున్నారు. ఇందులో భాగంగా యూసుఫ్‌గూడలోని జీహెచ్ఎంసీ 19 వ సర్కిల్ కార్యాలయానికి ట్రంకు పెట్టెలు చేరుకున్నాయి.

సామర్థ్య పెంపులో ఉపాధ్యాయుల పాత్ర కీలకం

కార్యక్రమంలో పాల్గొన్న ప్రొఫెసర్లు, అధ్యాపకులు

చిక్కడపల్లి, నవంబర్ 17: విద్యార్థుల సామర్థ్యాలను వెలికితీయడంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమని పలువురు ప్రొఫెసర్లు పేర్కొన్నారు. బాగ్‌లింగంపల్లి డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కళాశాలలో ఐదు రోజుల పాటు నిర్వహించిన ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రొగ్రామ్(ఎఫ్‌డీపీ) ఆదివారం ముగిసింది. ఉస్మానియా యునిర్సిటీ ప్రొఫెసర్ జయవెంకటేశ్వర్ మాట్లాడుతూ.. టీచింగ్ మెథడాలజీలో అధునిక పద్ధతులను వివరించారు. ప్రొఫెసర్ ఫ్యాట్రిక్ మాక్స్ మాస్ పలు సూచనలు చేశారు. భవన్స్ కళాశాల కామర్స్ విభాగాధిపతి ఎల్ఎస్ కమల మాట్లాడుతూ.. ఫ్యాకల్టీ అభివృద్ధిలో కంటెంట్ పరిజ్ఞానం టీచింగ్ అండ్ లెర్నింగ్ స్కిల్స్ మార్కెట్ అవసరాలకు అనుగుణంగా అధ్యాపకులు ఎప్పటికప్పుడు అప్‌డేట్ కావాలన్నారు. విద్యార్థులకు మెరుగైన బోధన అందించాలన్నారు. కార్యక్రమంలో ఓయూ కామర్స్ అండ్ మేనేజ్‌మెంట్ ప్రిన్సిపాల్ ఇంద్రకంటి శంకర్, కళాశాల డైరెక్టర్, ప్రిన్సిపాల్, అధ్యాపాకులు, ఫ్యాకల్టీలు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక చింతనతోనే మానసిక ప్రశాంతత

● ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్



పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే ముఠా గోపాల్‌ను సన్మానిస్తున్న దృశ్యం

చిక్కడపల్లి, నవంబర్ 17: ఆధ్యాత్మిక చింతనతోనే మానసిక ప్రశాంతత లభిస్తుందని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. గాంధీనగర్ డివిజన్‌లోని సిద్ధం శెట్టి అపార్ట్‌మెంట్ ఆవరణలోని బంగారు పోచమ్మ దేవాలయంలో కార్తికమాసం సందర్భంగా ఆదివారం పూజా కార్యక్రమాలు, వనభోజనాలు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే ఆలయంలో పూజలు నిర్వహించారు. అపార్ట్‌మెంట్‌కు చెందిన భక్తులు కొందరు అమ్మవారి కోసం చేయించిన బంగారు, వెండి ఆభరణాలు ఎమ్మెల్యే చేతుల మీదుగా అమ్మవారికి సమ్పరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. భక్తి భావనతోనే మనతో పాటు కుటుంబం అంతా ప్రశాతంగా ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ యువ నాయకుడు ముఠా జయసింహ, సీనియర్ నాయకుడు ముఠా నరేశ్, పార్టీ గాంధీనగర్ డివిజన్ అధ్యక్షుడు రాకేశ్ కుమార్, అసోసియేషన్ అధ్యక్షుడు రామారావు, కార్యదర్శి మూర్తి, జితేందర్, లక్ష్మి, మణి, పద్మ, ప్రసన్న పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల అందజేత

గాంధీనగర్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆదివారం సాయంత్రం ఎమ్మెల్యే ముఠా గోపాల్ సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఏడుగురు లబ్ధిదారులకు అందజేశారు. గాంధీనగర్ డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు రాకేశ్ కుమార్, రాంనగర్ డివిజన్ అధ్యక్షుడు శంకర్ ముదిరాజ్, మీడియా ఇన్‌చార్జి ముచ్చకుర్తి ప్రభాకర్, నాయకులు పున్న సత్యనారాయణ, ఎర్రం శ్రీనివాస్ గుప్తా, ముదిగొండ మరళి, ఎర్రం శేఖర్, ఎస్టీ ప్రేమ్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

జూబ్లీహిల్స్, నవంబర్ 17 : విద్యుత్ లైన్ల మరమ్మతులు, చెట్ల కొమ్మల తొలగింపు, ఇతర నిర్వహణ పనుల కారణంగా సోమవారం వివిధ 11 కేవీ ఫీడర్ల పరిధిలో విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు బంజారాహిల్స్ సీబీడీ ఏడీఈ గోపి ఒక ప్రకటనలో తెలిపారు. రోడ్డు నంబర్ 22 సబ్‌స్టేషన్ జూబ్లీహిల్స్ పీఎస్ ఫీడర్ పరిధిలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు.. ప్రశాసన్ నగర్ సబ్‌స్టేషన్ ఆరోగ్యశ్రీ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు. మాదాపూర్ సబ్‌స్టేషన్ శిల్పారామం, ఎన్ఏసి గ్రౌండ్ ఫీడర్‌ల పరిధిలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు.. వాల్యూల్యాబ్ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

శంషాబాద్ మండలంలో..

శంషాబాద్ రూరల్: నేడు శంషాబాద్ మండలంలోని చిన్నగోల్కొండ సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ శాఖ ఏఈ షేక్ భాషా ఓ ప్రకటనలో తెలిపారు. చిన్నగోల్కొండ సబ్‌స్టేషన్ పరిధిలోని చిన్నగోల్కొండ,పెద్దగోల్కొండ,సంఘీగూడ,రషీద్‌గూడ, హమిదుల్లానగర్,పోశెట్టిగూడ,బహదూర్‌గూడ, లక్ష్మీతండా, రాయికుంటలో వార్షిక మేటినేన్స్‌తో పాటు విద్యుత్ తీగల కింద ఉన్న చెట్లను తొలగించే కార్యక్రమం చేపడుతున్నట్లు వివరించారు. ఆయా గ్రామాలలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా పూర్తిగా నిలిపివేస్తామని ప్రజలందరు సహకరించాలని కోరారు.

'ప్రజా సమస్యలు పరిష్కరిస్తాం'

చిక్కడపల్లి, నవంబర్ 17: ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరిస్తామని గాంధీనగర్ డివిజన్ కార్పొరేటర్ ఎ.పావని అన్నారు. గాంధీనగర్ డివిజన్‌లోని ఎస్‌బీహెచ్ కాలనీవాసులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని ఆదివారం కార్పొరేటర్ పావనికి ఆ కాలనీవాసులు వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కాలనీవాసులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి అన్ని విధాలుగా చర్యలు తీసుకోనున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

సృజనాత్మక చిత్రాలతో సామాజిక చైతన్యం

స్వచ్ఛ సర్వేక్షణ్‌లో భాగంగా జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో యూసుఫ్‌గూడ ప్రభుత్వ పాఠశాల గోడలపై వేసిన సృజనాత్మక చిత్రాలు అందరినీ ఆకట్టుకుంటున్నాయి. పాఠశాల విద్యార్థులకు ఉపయుక్తంగా ఉండడంతో పాటు సామాజిక చైతన్యాన్ని కల్పించే వైవిధ్య భరితమైన రంగురంగుల చిత్రాలను కళాకారులు వేశారు. యూసుఫ్‌గూడ 19 వ సర్కిల్ అధికారులు సెల్ఫీ మూవ్‌మెంట్ వాల్ పెయింటింగ్స్‌తో కొత్త అందాలను ఆవిష్కరించారు. యూసుఫ్‌గూడ చెక్ పోస్ట్‌లో సిటీ బస్‌స్టాప్ కూడా ఉండడంతో ఈ చిత్రాలు అందరినీ ఆకర్శిస్తున్నాయి. – జూబ్లీహిల్స్,నవంబర్ 17

ఘనంగా కార్తీక వన మహోత్సవం

మణికొండ మున్సిపాలిటీ ఖాజాగూడ ల్యాంకో హిల్స్ పెద్ద గుట్టలోని అనంత పద్మనాభ స్వామి ఆలయ ప్రాంగణంలో ఆదివారం వివేక భారతి యోగ శాఖా ఆధ్వర్యంలో కార్తీక వన భోజనాల కుటుంబ సమ్మేళనం నిర్వహించారు. గోపూజ, తులసి, ఉసిరి చెట్ల పూజలు నిర్వహించారు. మలిపెద్ది శంకర్ ఆధ్వర్యంలో భక్తిగీతాలను ఆలపించారు. సామూహిక హనుమాన్ చాలీసా పారాయణం, భోజన మంత్ర పఠనంతో కూడిన సహ పంక్తి భోజనాలు, ఆటపాటలతో కూడిన భగవత్ గీత ద్వారా కుటుంబ విలువలను వివరించారు. ఈ కార్యక్రమంలో మోహన్‌రెడ్డి, హంప్రాజ్, కిరణ్ మట్టేవాడ, రాజు, సత్యనారాయణమూర్తి, రవి, అనిల్, సాయి బాబా, సాంబశివరావు, పూర్ణచంద్రరావు, ప్రసాద్, పట్టపు సాయి , వీఆర్ సహయోగ్ చారిటబుల్ ట్రస్టు సభ్యులు అందె లక్ష్మణ్ రావు, దిలీప్ కక్కడ్, రచ్చ శ్రీనాథ్ తదితరులు పాల్గొన్నారు.
– మణికొండ, నవంబర్ 17:

జంగన్నగౌడ్‌కు పాన్ ఇండియన్ నేషనల్ అవార్డు

జంగన్నగౌడ్‌కు అవార్డును ప్రదానం చేస్తున్న ప్రముఖులు

చిక్కడపల్లి, నవంబర్ 17: సామాజిక సేవకుడు గడ్డమీది జంగన్నగౌడ్‌కు పాన్ ఇండియా నేషనల్ అవార్డు దక్కింది. ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం, గజల్ శ్రీనివాస్, తెలంగాణ యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వేణుగోపాల్ కృష్ణ, అవార్డు ఆర్గనైజేషన్ అధ్యక్షుడు అద్దంకి రాజు తదితరులు ఆయనకు అవార్డును ప్రదానం చేశారు.

అనాథలకు ప్రాథమిక చికిత్స

బన్సీలాల్‌పేట్, నవంబర్ 17: నగరంలోని రోడ్ల పక్కన, ఫుట్‌పాత్‌లపై ఉంటున్న వృద్ధులు, నిరాశ్రయులు, దివ్యాంగులకు భోజనం సమకూర్చామని పద్మారావునగర్‌లోని స్కై ఫౌండేషన్ అధ్యక్షుడు డాక్టర్ వై.సంజీవ్ కుమార్, ఉపాధ్యక్షురాలు ఓ.పావని తెలిపారు. కొందరికి గాయాలవడంతో ప్రాథమిక చికిత్స చేసి మందులను కూడా అందజేసినట్లు పేర్కొన్నారు.

● సజావుగా గ్రూప్-3 పరీక్షలు

సికింద్రాబాద్ వీజీ కళాశాలలో గ్రూప్-3 పరీక్ష రాసేందుకు వస్తున్న అభ్యర్థులు, తనిఖీ చేస్తున్న పోలీసులు

గోవుల సంరక్షణకు పాడుపు చేయాలి

సుల్తాన్‌బజార్, నవంబర్ 17 : గో మాతల సంరక్షణ కోసం ప్రతి రోజు ఒక్క రూపాయి ఆదా చేసేందుకు లవ్ ఫర్ కౌ ఫౌండేషన్ ఎంతో ఉత్సాహంగా ప్రచారం చేస్తుందని ఫౌండేషన్ చైర్మన్ జస్మత్ పటేల్, ట్రస్టీ రిథేశ్ జాగిర్ధార్ అన్నారు. ఆదివారం రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మను వారు పలు గో సంఘాల ప్రతినిధులతో మర్యాద పూర్వకంగా కలిసి గోమాత విగ్రహాన్ని, లవ్ ఫర్ కౌ జ్ఞాపికను అంద జేసి సత్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. నిత్యం ఒక్క రూపాయిని పొదుపు చేస్తే నెల 30 రూపాయలు,సంవత్సరానికి 365 రూపా యలు వస్తుందని అన్నారు. ఈ డబ్బును పొదుపు చేయడం ద్వారా గోమాత సేవలకు సహకరించవచ్చని, భవిష్యత్ తరాలకు గో మాతలను సంరక్షించే విషయాలను వారు గవర్నర్‌కు వివరించారు.

నేటి నుంచి బొడ్రాయి పునఃప్రతిష్ఠ ఉత్సవాలు

అంబర్‌పేట, నవంబర్ 17 : అంబర్‌పేట దేవస్థాన సేవా సమితి ఆధ్వర్యంలో అంబర్‌పేట బొడ్రాయి (నాభిశిల) పునఃప్రతిష్ఠ మహోత్సవాలు ఈ నెల 18వ తేదీ నుంచి 21వ తేదీ వరకు ఘనంగా నిర్వహించేందుకు సమితి ప్రతినిధులు పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేశారు. ఒక్కో రోజు ఒక్కో పూజా కార్యక్రమాలను నిర్వహిస్తారు. ఇందులో భాగంగా ఆదివారం అంబర్‌పేట మెయిన్‌రోడ్డులో గల పాత బొడ్రాయిని తొలగించి గాంధీ బొమ్మ ఎదురుగా కొత్త బొడ్రాయిని ప్రతిష్ఠించే స్థలంలో పూజా కార్యక్రమాల మధ్య నిక్షిప్తం చేశారు. ఈ నెల 18 నుంచి ప్రతిష్ఠ కార్యక్రమాలు ఉంటాయని నిర్వాహకులు పేర్కొన్నారు.